సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం ⁞ 4 ⁞ జూన్ ⁞ 2025



సీ వీడ్.. సో గుడ్

సముద్రపు నాచు (సీ వీడ్) తీరప్రాంత మహిళలకు కుటీర పరిశ్రమగా మారుతోంది. తక్కువ కాలంలోనే అధిక దిగుబడులు సాధించే నాచు పెంపకానికి డిమాండ్ పెరుగుతోంది. 8లో ▸



నూతన వంగడాలపై దృష్టి పెట్టాలి

రైతులు నూతన వంగడాల వైపు మొగ్గు చూపాలని ఉండి కేవీకే శాస్త్రవేత్త వినయ లక్ష్మి అన్నారు. రాయలంలో నూతన వంగడాలపై అవగాహన కల్పించారు. 8లో ▸



అధికారులు న్యాయం చేయాలి

ఓఎన్‌జీసీ అధికారులు న్యాయం చేయాలని రైతులు ఆందోళన చేశారు. రైతులకు కేవలం ఒక పంటకు మాత్రమే డబ్బులు వేశారని ఆరోపిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

నిరసన గళం వినిపించాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కూటమి ఏడాది పాలనలో మహిళలు, విద్యార్థులు, కార్మికులు ఇలా.. అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారని విమర్శించారు. జూన్ 4న వెన్నుపోటు దినంగా పరిగణించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని చెప్పారు. నిరసన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. యువత పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ స్వర్ణయుగం పాలన నడిచిందని.. అప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని గద్దెనెక్కిన ఏడాదిలోపే అమలు చేశారని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసి పాలన సాగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మఒడి లాంటి పథకాలు అమలు కాక పేద, మధ్య తరగతి పిల్లల చదువులు భారంగా మారాయని అన్నారు.

రేషన్ డిపోల రద్దుకు కుట్ర

భీమవరం: చౌక డిపోల ద్వారా ప్రజలకిచ్చే రేషన్ సరుకుల రద్దుకు ప్రభుత్వం కుట్రచేస్తోందని దీనిలో భాగంగానే నగదు బదిలీ అంటూ ప్రచారం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేస్తూ రేషన్ వద్దనుకుంటే నగదు బదిలీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. చౌకడిపోలను పూర్తిగా తీసేయాలనే ఆలోచనే చేస్తున్నారన్నారు. రేషన్ సరఫరాలో అక్రమాలు, అవినీతి ఉంటే వాటిని అరికట్టే చర్యలు తీసుకోవాలి తప్ప డీబీటీ విధానం సరైంది కాదన్నారు. తెలంగాణలో తరహా సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ సరుకులు చౌక డిపోలతో పాటు ఇంటింటికి వాహనాల ద్వారా ఇవ్వాలని, అన్ని రకాల నిత్యావసర సరుకులను రేషన్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏలూరులో 12 కరోనా కేసుల నమోదు

ఏలూరు టౌన్: కరోనా వైరస్ మరోసారి విజృంభిస్తోంది. చాపకింద నీరులా పాజిటివ్ కేసులు మెల్లగా పెరుగుతున్నాయి. ఇంతవరకూ మొత్తం 12 కరోనా కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ప్రజలను అప్రమత్తం చేయటంలో విఫలమయ్యారు. తాజాగా మంగళవారం మరో రెండు కరోనా పాజిటివ్ కేసులు ఏలూరులో నమోదయ్యాయి. నగరంలోని నరసింహారావుపేటలో ఒకటి, మోతేవారి తోటలో కరోనా కేసు నమోదైంది. సోమవారం మంచినీళ్ళతోట, వెంకటాపురం పంచాయతీల్లో ఇద్దరు మహిళలకు కరోనా సోకింది. ఇప్పటికే ఏలూరు కలెక్టరేట్‌లో ఐదుగురు ఉద్యోగులకు, అమీనాపేటలో ఒకరికి, శాంతినగర్‌లో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులకు కరోనా పాజిటివ్ వచ్చింది. కరోనా సోకిన బాధితులను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స పొందేలా వైద్యులు చర్యలు చేపట్టారు. ఏలూరు జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 162 కరోనా పరీక్షలు చేసినట్లుగా వైద్యాధికారులు చెబుతున్నారు.


1,684 కేసుల నమోదు

ఏలూరు (టూటౌన్): మే నెలలో జిల్లా వ్యాప్తంగా రవాణా, వ్యక్తిగత వాహనాలపై 1,684 కేసులు నమోదు చేసి రూ.1.03 కోట్లను అపరాధ రుసుంగా విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. పన్ను చెల్లించని 72 వాహనాలు సీజ్ చేశామన్నారు.

ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇళ్ల ప్రగతికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా గృహనిర్మాణ శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. లక్ష్యాలను సాధించకపోతే ఉపేక్షించేది లేదని.. రానున్న 10 రోజుల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతి కనబడాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న జిల్లా వ్యాప్తంగా 4.50 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఈఓపీఆర్‌డీఓ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని 27 మండలాల్లో ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. సమీప నర్సరీల నుంచి మొక్కలు తీసుకుని జూన్ 5న నాటేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ వద్ద ఉన్న రెండు డయాలసిస్ మిషన్లకు అదనంగా మరో రెండు డయాలసిస్ మిషన్లతో డయాలసిస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

సంక్షేమం, అభివృద్ధికి వెన్నుపోటు



- ఎన్నికల్లో హామీల వరద పారించిన కూటమి నేతలు
- ఏడాది పాలనలో ఒక్క హామీని అమలు చేయని వైనం
- కూటమి దగాపై జూన్ 4ను 'వెన్నుపోటు దినం'గా ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- నియోజకవర్గ కేంద్రాల్లో నేడు నిరసన కార్యక్రమాలు
- తొలి ఏడాదే నవరత్నాలు అమల్లోకి తెచ్చిన జగన్ సర్కారు
- ఐదేళ్లలో పేదలకు రూ.11,333.57 కోట్ల లబ్ధి

అంతన్నారు.. ఇంతన్నారు..

అధికారంలోకి రావడమే ఆలస్యం.. సూపర్ సిక్స్ అంటూ ఊరూరా ఊదరగొట్టారు. జూన్ నుంచే అమలు.. ఇవిగో బాండ్లు అంటూ కూటమి నేతలు ఏ కుటుంబానికి ఎంత వస్తుందో కరపత్రాలపై రాసి మరీ ఇంటింటికీ ఇచ్చేశారు. కూటమి పాలన చేపట్టి ఏడాదైనా సూపర్ సిక్స్ జాడలేదు. కూటమి వంచనకు నిరసనగా జూన్ 4ను 'వెన్నుపోటు దినం'గా వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. ప్రజల పక్షాన నియోజకవర్గ కేంద్రాల్లో నేడు నిరసన తెలుపనుంది.

– సాక్షి, భీమవరం

ఈ హామీల ఊసే లేదు

- జనవరిలో ఆచంటలో టీడీపీ రా కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఆచంట మండలం అయోధ్యలంక–కోడేరు మధ్య గోదావరిపై వారధి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయోధ్యలంకలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.
- ఏప్రిల్ 05: పాలకొల్లు సభలో చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్రావణ మాసంలో జిల్లాలో టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలు చేయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని రోడ్లన్నింటిని బాగుచేస్తామన్నారు.
- ఏప్రిల్ 10: తణుకులోని నరేంద్ర సెంటర్ వద్ద బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తణుకులో హైటెక్ టవర్ నిర్మిస్తామన్నారు. ఇంటి వద్ద నుంచే ఉద్యోగాలు చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని తెస్తామని చెప్పారు. తణుకును పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని, వలసలు అరికడతామని వాగ్దానం చేశారు.
- ఏప్రిల్ 21: నరసాపురం, భీమవరం సభల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వశిష్ట గోదావరిపై వంతెన పనులు ప్రారంభిస్తామన్నారు. భీమవరంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. వీరవాసరం మండలం, భీమవరం మండలాల్లోని శివారు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.
- ఏప్రిల్ 29: తాడేపల్లిగూడెం వారాహి సభలో పవన్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంను మార్కెట్ హబ్‌గా, ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. మిలటరీ మాధవరం–తాడేపల్లిగూడెం ఎయిర్‌పోర్టు భూములను అన్యాక్రాంతం నుంచి కాపాడతామన్నారు. మిలటరీ ఉద్యోగుల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయిస్తామన్నారు.
- మే 10: ఉండిలో చంద్రబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో భూగర్భ జలాలు కలుషితమైనందున విజ్జేశ్వరం నుంచి ప్రొజెక్టెడ్ వాటర్ స్కీమ్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా ఇంటింటికి ఇస్తామన్నారు. యూనిట్ కరెంట్ రూ.1.50కే ఇచ్చి ఆక్వా రంగాన్ని పైకి తెస్తానన్నారు. అవసరమైన చోట్ల 500 టన్నులు కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజీలు కట్టిస్తామన్నారు. ఏరియేటర్స్‌పై సబ్సిడీ ఇప్పిస్తానన్నారు. ఆకివీడులో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి లేదా ఫ్లై ఓవర్ నిర్మిస్తామని హామీలు గుప్పించారు. ఏడాది పాలన ముగుస్తున్నా.. ఒక్క హామీ అమలుచేసే దిశగా చర్యలు తీసుకోలేదు.

టీడీపీ నేతలకు పండుగ

గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధి కోసం పల్లె పండుగ పేరిట రూ.46.48 కోట్లు ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను కూటమి నేతలే దక్కించుకున్నారు. ప్రజావసరాల మేరకు రోడ్లు నిర్మాణం చేయాల్సి ఉండగా చాలాచోట్ల తమ భూముల విలువ పెంచుకునేలా ఖాళీ స్థలాలు, పొలాలు, చెరువులకు రోడ్లు వేయించుకోగా గత టీడీపీ హయాంలో చేసిన రోడ్లకు కొత్తగా మెరుగులు దిద్ది బిల్లులు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మరమ్మతుల్లోనూ మోసం

రోడ్లను అద్దంలా చేస్తామన్న హామీని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం కనీస మరమ్మతులకు చేతులెత్తేసింది. జిల్లాలో 698 కి.మీ మేర మరమ్మతుల కోసం రూ.42.57 కోట్లు మంజూరు చేసింది. సంక్రాంతి నాటికి గుంతలు లేకుండా చేస్తామని చెప్పగా ఇప్పటికి పూర్తికాని పరిస్థితి. నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా చాలాచోట్ల నాసిరకంగా పనులు చేసి ప్రజాధనాన్ని కాజేశారు. కొన్నిచోట్ల గుంతల్లో కంకర, చిప్స్ వేసి తారు వేయకుండా వదిలేశారు. వాహనాల తాకిడికి రాళ్లు పైకిలేచి మరమ్మతులు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి.

విజయవంతం చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి వంచనతో పాలన సాగిస్తోంది. ప్రజల పక్షాన బుధవారం నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరుగనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

వంచనకు ఏడాది



కూటమి ప్రభుత్వ వంచన పాలన మొదలై అప్పుడే ఏడాది. ఎన్నో వాగ్దానాలతో గద్దెనెక్కిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఈ ఏడాదిలో ఒక్క హామీని అమలుచేయకుండా నమ్మి ఓట్లేసిన ప్రజలను దగా చేశారు. సంక్షేమాన్ని విస్మరించి కూటమి సాగిస్తున్న అరాచక పాలనకు నిదర్శనమే 'వెన్నుపోటు దినం'.

– ముదునూరి మురళీకృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ అబ్జర్వర్

ఆడబిడ్డకు అన్యాయం

- మహిళలకు ప్రతీ నెల రూ: 1500
- జిల్లాలో రూ.1500 పొందేందుకు అర్హులు – 5,96,313

ఆడబిడ్డ నిధి పథకం కింద ఏడాదిలో నష్టపోయిన మొత్తం రూ. **1073** కోట్లు

తల్లికి నష్టం

- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్ విద్యార్థులు : 2,49,662
- అర్హులైన విద్యార్థులు (70 శాతం) సుమారు : 1,74,763 మంది

తల్లికి వందనంగా గత విద్యా సంవత్సరంలో తల్లులు నష్టపోయిన మొత్తం రూ. **262.14** కోట్లు

అన్నదాత దుఃఖీభవ

- జిల్లాలో సాగు భూమి : 2.3 లక్షల ఎకరాలు
- రైతులు : 1,24,645


అన్నదాత సుఖీభవ అందక గత సీజన్‌లో రైతులు నష్టపోయిన సాయం రూ. **249.29** కోట్లు

నిరుద్యోగులకు అందని భృతి

- జిల్లాలో కుటుంబాలు : 5.17 లక్షలు
- రూ.3000 ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు
- మొత్తం రేషన్‌కార్డులు : 5,67,651
- ఒక్కో కార్డుపై ఏడాదికి మూడు చొప్పున ఇవ్వాల్సిన గ్యాస్ సిలెండర్లు : 17,02,953
- గత ఆర్థిక సంవత్సరంలో ఒక్కటి చొప్పున ఇచ్చిన సిలెండర్లు : 5,67,651
- లబ్ధిదారులు కోల్పోయిన సిలెండర్లు : 11,35,302
- గ్యాస్ ధర రూ. 827.50. ఆ మేరకు గత ఏడాది నష్టపోయిన మొత్తం రూ.93.94 కోట్లు

ఉచిత బస్ తుస్సు

- జిల్లాలో మొత్తం జనాభా 19,00,228
- పురుషులు : 9,48,461
- మహిళల జనాభా : 9,51,766
- ఎన్నికల హామీ మేరకు మహిళలందరికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి.



'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ ఇంటిలోని కుటుంబ సభ్యులకు సూపర్ సిక్స్‌లోని వర్తించే పథకాలు, వాటి ద్వారా చేకూరే లబ్ధిని పేర్కొంటూ టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షుడు సంతకం చేసి మరీ ఇంటింటికి పేపర్లు అందజేశారు. వాటినే బాండ్ పేపర్లుగా భావించాలని ఓటర్లను కోరారు. 2024 జూన్ నుంచే పథకాలు అమల్లోకి వస్తాయని అందులో పేర్కొన్నారు. వాటి జాడే లేకుండా ఏడాది పాలన సాగించారు.

నాడు తలుపుతట్టిన సంక్షేమం

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే నవరత్న పథకాలు అమల్లోకి తెచ్చారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా దళారులు, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల గడప చెంతకే చేరవేశారు. ఏటా సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసి నిర్ణీత రోజున అమలుచేస్తూ వచ్చారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలోని పేదవర్గాల వారికి డీబీటీ రూపంలో రూ. 9971.5 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 1362.07 కోట్లు అందజేశారు.



నాడు-నేడులో మారిన నరసాపురం ఎస్ఎల్ఎన్ మున్సిపల్ స్కూల్

నేడు 'వెన్నుపోటు దినం'

ఏడాది పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరించి కూటమి చేస్తున్న మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు నిరసనగా బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'వెన్నుపోటు దినం' నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉదయం 10 గంటలకు నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున ర్యాలీగా తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాలకు చేరుకుని వినతిపత్రాలు అందజేయనున్నారు.



ప్రమాదభరితంగా తయారైన నౌడూరు-బ్రాహ్మణచెరువు రోడ్డు

రాష్ట్రంలో మద్యం, గంజాయి పాలన

- ఆకివీడులో చిన్నారిపై అఘాయిత్యం దారుణం
- వైఎస్సార్‌సీపీ నేతల ఆందోళన

ఆకివీడు: రాష్ట్రంలో గంజాయి, మద్యం ఏరులైపారడంతో మహిళలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. స్థానికంగా చిన్నారిపై అఘాయిత్యాన్ని ఖండిస్తూ మంగళవారం నేతలు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుండుగొలను సావిత్రి, ధనరాజు మాట్లాడుతూ ఏడేళ్ల చిన్నారిపై అత్యాచార సంఘటన అమానవీయమన్నారు. టీడీపీకి చెందిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించాలంటే పట్టణ, గ్రామాలకు దూరంగా మద్యం షాపులు ఉండాలన్నారు. బెల్టు షాపుల బెల్టు ఎప్పుడు తీస్తారని ప్రశ్నించారు. గంజాయి అమ్మకాలపై పోలీస్ యంత్రాంగం తీవ్ర నిర్లిప్తతతో ఉందన్నారు. పట్టణంలోని విచ్చలవిడిగా గంజాయి, మద్యం దొరుకుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, గేదెల అప్పారావు, దొడ్డి జగదీష్, తిరుమానేని జగన్, కిషోర్‌రెడ్డి, మోరా శ్రీనివాసరెడ్డి, కుంకట్ల దానయ్య పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


వేతనాల కోసం ఉపాధి కూలీల ధర్నా

పెంటపాడు: గత మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందకపోవడంతో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆకుతీగపాడు, బోడపాడు, ముదునూరు గ్రామాలలో నిరసన తెలిపారు. పనిచేస్తున్న ప్రదేశాలలో పలువురు కూలీలు మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి ఇంత వరకు వేతనాలు అందలేదన్నారు. పెరిగిన ధరలతో ఒక పక్క ఇబ్బందులు పడుతున్నామని, మరోవైపు కూలి పనులు చేసినా పస్తులు ఉండాల్సి వస్తోందని వాపోయారు. కూటమి ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు.



ఆకుతీగపాడులో ఉపాధి కూలీల ధర్నా

తాళ్లకోడు ఇళ్ల రీ-సర్వేపై జేసీ విచారణ



రీ-సర్వేపై విచారణ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలోని ఇళ్ల రీ-సర్వేపై తుది విచారణను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం చేపట్టారు. కాలనీలో గత వారం రోజులుగా ఆరు బృందాలు రీ-సర్వే చేశాయి. అనంతరం భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. కాలనీలో 3,420 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల్ని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కేటాయించారు. వారికి పట్టాలు కూడా ఇచ్చారు. ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు అందజేశారు. దీంతో 1000 మంది గృహ ప్రవేశాలు చేశారు. మరో 1200 ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. మిగిలిన నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు పునాదులు వేసి, తగిన సొమ్ములేక ఆగిపోయారు. మరికొంత మంది పునాదులు వేసేందుకు సొమ్ము లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోలేదనే కారణంగా వారి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం వెనక్కి తీసుకునేందుకు రీ సర్వే ఏర్పాటు చేశారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 4 లక్షలు తక్షణం విడుదల చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి పేదల ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ఇదేం పరేషాన్



ఏలూరు సత్యనారాయణపేటలో రేషన్‌షాపు వద్ద చిన్న, పెద్ద పడిగాపులు

రేషన్ షాపుల వద్ద నిత్యావసరాల కోసం జనం అవస్థలు కొనసాగుతున్నాయి. ఇంటి వద్దకే రేషన్‌కు మంగళం పాడిన కూటమి సర్కారు.. జగన్ సర్కారుకు పేరు వస్తుందనే అక్కసుతో షాపుల వద్దే సరుకులు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో మూడో రోజు మంగళవారం కూడా కార్డుదారులు అవస్థలు పడ్డారు. చాలా చోట్ల సర్వర్ పనిచేయక క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ అమలు కాక చాలా చోట్ల వృద్ధులు షాపులకు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు ఎండలో ఇక్కట్లు పడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసాపురం టేలర్‌పేటలో రేషన్ షాపు నుంచి ఎండలో బియ్యం తీసుకెళుతున్న వృద్ధుడు



కొయ్యలగూడెంలో రేషన్ కోసం క్యూలైన్‌లో...

క్లుప్తంగా

డిపో సీఐ దురుసు ప్రవర్తనపై నిరసన



ఆర్టీసీ గ్యారేజీ ముందు ఆందోళన చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏపీఎస్ ఆర్టీసీ ఏలూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి డి.ఆంజనేయులుపై డిపో సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. యూనియన్ ఏలూరు డిపో గౌరవ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంజనేయులు పట్ల సీఐ అలా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. యూనియన్ నాయకులు, కమిటీ సభ్యుల పట్ల ఆర్టీసీ అధికారులు సూపర్‌వైజర్ చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. వెహికల్ కండిషన్ మెరుగు పరచాలని పదేపదే మేనేజ్‌మెంట్‌కు చెప్పినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. డిపోలో కనీస మౌలిక వసతులు లేవని అన్నారు. ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని, బుధవారం నుంచి నాన్ కోపరేషన్ పాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ డిపో నాయకులు వీఎస్ నారాయణ, ఎండి రమేష్, పీకేబీ రాజు, పి.శ్రీహరి పాల్గొన్నారు.

కూలీలు పస్తులుంటే.. యోగాలో నిమగ్నమా!



ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

భీమవరం అర్బన్: గత రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీలు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. అధికారులందరూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాలో నిమగ్నమైపోవడం దారుణమని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. భీమవరం మండలంలోని గూట్లపాడు, గొల్లవానితిప్ప గ్రామాల్లో మంగళవారం సీఐటీయూ సంఘం సభ్యులు పర్యటించి ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ పనులు చేసిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే యోగాసనాల్లో అధికారులు నిమగ్నమైపోవడం బాధాకరమన్నారు. ఉపాధి హామీ రోజు కూలీ రూ.600 చేసి ఏడాదికి 200 పనిదినాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

భీమడోలు: దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం గ్రామానికి చెందిన అన్నేపు దుర్గాప్రసాద్ (35) కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన దుర్గాప్రసాద్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. మంగళవారం ఒక్కసారిగా విపరీతంగా కడుపు నొప్పి రావడంతో తట్టుకోలేక పురుగు మందును సేవించి మృతి చెందాడు. ఆతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

సీ వీడ్.. సో గుడ్

- రాష్ట్రంలో కుటీర పరిశ్రమగా నాచు సాగు
- ప్రయోగాత్మకంగా విశాఖపట్నంలో మొదటి సాగు
- రాష్ట్రంలో 60 వేల యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- నేడు జాతీయ సముద్రపు నాచు దినోత్సవం



సముద్రంలో నాచు సాగు

కైకలూరు: సముద్రపు నాచు (సీ వీడ్) తీరప్రాంత మహిళలకు కుటీర పరిశ్రమగా మారుతోంది. మంచి నీరు, ఎరువులు, పురుగు మందులు, ఆహారం అవసరం లేకుండా సముద్రంలో తక్కువ కాలంలోనే అధిక దిగుబడులు సాధించే నాచు పెంపకానికి డిమాండ్ పెరుగుతోంది. ఆక్వా రంగానికి ప్రత్యామ్నాయంగా నాచు సాగు మారనుంది. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ (సీఎంఎఫ్ఆర్ఐ), కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) ద్వారా మహిళలకు సబ్సిడీ రుణాలిచ్చేందుకు ప్రభుత్వం ముందుకొస్తోంది. సీ వీడ్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 4న జాతీయ సముద్రపు నాచు దినోత్సవం జరుపుతారు.

పోషకాల గని.. సముద్రపు నాచు

సముద్రపు నాచు (మెరైన్ ఆల్గే)లో పోషక, ఔషధ విలువలు అధికంగా ఉంటాయి. తెప్పలు, రేస్ వేలు, మోనోలైన్, తాళ్ల వంటి పద్ధతుల్లో సముద్రంలో నాచును సాగు చేస్తున్నారు. తమిళనాడులోని మండపం ప్రాంతం నుంచి కప్పఫైకాస్, గ్రాసిలేరియా అనే జాతుల విత్తనాలను ఏపీకి తెస్తున్నారు. ఒక్కో పంట 45-60 రోజుల సమయం పడుతోంది. సీ వీడ్‌లో ప్రొటీన్, ఖనిజాలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. వీటిని బిస్కెట్లు, పాస్తా, నూడుల్స్, సూప్ పౌడర్లు, పెరుగు వంటి అహార పదార్థాల్లో వినియోగిస్తారు. ఔషధ, సౌందర్య రంగాల్లోనూ సీ వీడ్‌కు డిమాండ్ ఉంది. దీంతో ఆగార్, కరోజీనాన్ పదార్థాలు తయారవుతాయి. వీటిని టూత్‌పేస్ట్, స్కిన్ కేర్ ఉత్పత్తుల ఔషధాల్లో వినియోగిస్తారు. వ్యవసాయంలో బయో ఫెర్టిలైజర్లుగా కూడా దీనిని వాడతారు. సీ వీడ్‌తో తయారు చేసిన తినుబండారాలు, సాల్ట్, ఆయిల్, స్నాక్స్‌కు డిమాండ్ ఉంది.



కప్పఫైకాస్ జాతి నాచు



సీ వీడ్ ప్రోసెసింగ్‌లో మహిళలు

రాష్ట్రంలో 36 కేంద్రాల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లో 1,027 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. సీ వీడ్ సాగుకు అనుకూలమైన 36 ప్రాంతాలను రాష్ట్ర వ్యాప్తంగా సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) గుర్తించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలు సీ వీడ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. నరసాపురం, మొగల్తూరు, సూర్యలంక, విశాఖపట్నం, శ్రీకాకుళంలోని బుడగట్టుపాలెంలో పైలట్ ప్రాజెక్టుగా సీ వీడ్ సాగు చేపట్టనున్నారు. విశాఖపట్నం, బుడగట్టుపాలెంలో ప్రయోగాత్మక సాగు చేపట్టారు. పీఎంఎంఎస్‌వై ద్వారా వీడ్ సాగుకు కేంద్రం 60 శాతం సబ్సిడీ అందిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 60 వేల యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

సముద్రపు నాచు విశేషాలివీ!

- భూగోళంపై పండించే కూరగాయల కంటే సముద్రంలో పెరిగే నాచు పరిమాణం 30 శాతం ఎక్కువ.
- సముద్రంలో అదనపు రసాయనాలు, భారీ లోహాలను ఇది గ్రహిస్తుంది.
- పర్యావరణ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుంది.
- సముద్రపు నాచును జీరో ఇన్‌పుట్ ఫుడ్‌గా పిలుస్తారు.
- సముద్రంలో కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహిస్తుంది.
- పశువుల ఆహారం, ఆక్వా కల్చర్‌లో దీనిని ఫీడ్ సప్లిమెంట్లుగా వినియోగిస్తారు.
- సముద్రపు జీవులకు ఆహారం, ఆశ్రయం అందించి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర పోషిస్తుంది.
- సేంద్రియ ఎరువుగా కార్బోహైడ్రేట్లు, సూక్ష్మ పోషకాలు, ఖనిజాలు అధికం.
- ఆహార పరిశ్రమ, ఔషధ, సౌందర్య రంగం, వ్యవసాయంలో దీనిని వినియోగిస్తారు.
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఇస్తుంది.
- మత్స్యకారులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం.



సముద్రపు నాచుతో తయారు చేసిన ఉత్పత్తులు

తొలి విడతలో 2.2 టన్నుల దిగుబడి



విశాఖపట్నం ఆర్కే బీచ్ సమీపంలో తొలిసారిగా సీ వీడ్ సాగును 50 యూనిట్ల ద్వారా ధాన్ ఫౌండేషన్ మహిళలు చేపట్టారు. మొదటి విడతలో 2.20 టన్నుల దిగుబడి వచ్చింది. కిలో రూ.23 ధర పలికింది. ఈ ప్రాజెక్టుకు పెట్టుబడి రూ.4.50 లక్షలు అయింది. మొదటిసారి పెట్టుబడితో అమర్చిన సామగ్రి 8 ఏళ్లపాటు ఉపయోగపడతాయి. రెండో సాగు నుంచి పెట్టుబడి వ్యయం బాగా తగ్గుతుంది. ఇది ప్రధానంగా మహిళలకు కుటీర పరిశ్రమగా మారుతుంది. కేంద్రం సబ్సిడీ ఇచ్చి సీ వీడ్ సాగుకు అవకాశం కల్పిస్తోంది. – పి.లక్ష్మణరావు, మత్స్యశాఖ జేడీ, విశాఖ

అవగాహన పెంచాలి



సముద్రపు నాచుపై తీరప్రాంత ప్రజలకు అవగాహన పెంచాలి. రాష్ట్రంలో ప్రోసెసింగ్ యూనిట్లు, సీడ్ హేచరీలను ఏర్పాటు చేయాలి. సముద్రపు నాచు పరిశ్రమను వ్యవసాయంగా గుర్తించి బీమా సౌకర్యం కల్పించాలి. సాగు పద్ధతులపై శిక్షణ, సాంకేతిక మార్గదర్శకాలను అందించాలి. – డాక్టర్ పి.రామమోహన్‌రావు, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

వైఎస్ఆర్ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు

ఏలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డాక్టర్ వైఎస్ఆర్ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశాలు నిర్వహిస్తోందని ఏలూరు జిల్లా డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 1, 2015 నుంచి మార్చి 31, 2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. అలాగే ఏప్రిల్ 1 2014 నుంచి మార్చి 31 2016 మధ్య జన్మించినవారు 5వ తరగతిలో ప్రవేశించవచ్చని వివరించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ దరఖాస్తుల పరిశీలన చేసి శాప్ షార్ట్ లిస్ట్ విడుదల చేస్తుందన్నారు. అనంతరం జూలై 1 నుంచి 3వ తేదీ వరకూ జిల్లాస్థాయి, జూలై 10 నుంచి 11వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 98663-17326, 99487 79015 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మట్టి ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి



అంజమ్మ మృతదేహం

ముసునూరు: మట్టి అక్రమ తోలకాలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని గోపవరంలో చోటుచేసుకుంది. గ్రామంలో పగలూ రాత్రి తేడా లేకుండా మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మట్టి ట్రిప్పులు అధికంగా వేయాలనే ఆత్రంతో లైసెన్సులు లేని, డ్రైవింగ్ కూడా సరిగా రాని వారు కూడా గ్రామంలో మట్టి ట్రాక్టర్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మట్టి ట్రాక్టరు వెనుక నుంచి ఢీ కొట్టడంతో గ్రామానికి చెందిన వృద్ధురాలు గడ్డం అంజమ్మ (65) అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు.

ఓఎన్‌జీసీ అధికారులు న్యాయం చేయాలి



ఇరగవరం ఓఎన్‌జీసీ రిగ్ వద్ద రైతుల ధర్నా

ఇరగవరం: ఓఎన్‌జీసీ అధికారులు తమకు న్యాయం చేయాలని రైతులు మంగళవారం ఆందోళన చేశారు. ఇరగవరం, సరిహద్దు ప్రాంతం అర్జునుడుపాలెం గ్రామాలకు చెందిన 21 మంది రైతుల వద్ద నుంచి సుమారు 8 ఎకరాలు లీజు ప్రాతిపదికన 2023వ సంవత్సరంలో పంటకు ఎకరాకు రూ.82,200, చెట్లకు రూ.6,500 చొప్పున నగదు చెల్లించే విధంగా తీసుకున్నారు. అనంతరం ఓఎన్‌జీసీ డ్రిల్ పనులు ప్రారంభించారు. అయితే అక్కడ ఆయిల్ పడలేదు. దీంతో రైతులకు కేవలం ఒక పంటకు మాత్రమే డబ్బులు వేశారు. తరువాత రైతులకు చెప్పకుండా ఓఎన్‌జీసీ అధికారులు మొత్తం సామగ్రిని తరలించుకుపోతున్నారు. దీనిపై ఓఎన్‌జీసీ అధికారులను ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పకపోవడంతో మంగళవారం ఓఎన్‌జీసీ డ్రిల్ దగ్గర నుంచి తరలిస్తున్న వాహనాలను రైతులు అడ్డుకుని ధర్నా చేశారు. సమాచారం అందుకున్న ఓఎన్‌జీసీ రాజమండ్రి తహసీల్దార్ జాలి జనార్ధన్, సివిల్ ఇంజనీరు శేషు వచ్చి రైతులతో మాట్లాడారు. వచ్చే జూలై నెలలో ఒక పంట డబ్బులు, తరువాత మరో పంట డబ్బులు అకౌంట్‌ల్లో వేయడం జరుగుతుందని, లీజు పూర్తయ్యే వరకు రైతులకు లీజు డబ్బులు చెల్లిస్తామని రాతపూర్వకంగా రాసి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

గ్యాస్ లీకై పెళ్లింట్లో ప్రమాదం

పెండ్లి కుమారుడు సహా ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు

పెనుగొండ: పెళ్లింట్లో అకస్మాత్తుగా జరిగిన ఓ ప్రమాదంలో ఏడుగురు గాయాలపాలయ్యారు. వివరాల ప్రకారం చెరుకువాడ కొండపల్లి వారి వీధిలో ఇవ్వల నాగేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు వివాహం బుధవారం జరగనుండడంతో బంధువులు, స్నేహితులు అందరూ వచ్చారు. మంగళవారం ఇంటిలో గ్యాస్ వెలిగించి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై ఆకస్మాతుగా మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమై మంటలు అదుపులోకి తీసుకు రావడానికి ప్రయత్నించడంతో పెండ్లి కుమారుడు శ్రీనివాసరావుతో పాటు, బంధువులు అయినపర్తి లక్ష్మీ, కవిటం నాగమణి, సూర్య హనుమంతరావు, సత్యవతి, నరసింహమూర్తి , మాచవరపు వీరేంద్ర గాయాలపాలయ్యారు. వీరికి కాళ్లు చేతులు, పొట్ట, వీపు మీద గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన పెనుగొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పెళ్లింట్లో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

• కదిలిన యంత్రాంగం



చెత్త తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

నరసాపురంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి రోడ్డు శుభ్రం చేశారు. చెత్త రోడ్డుపై పోరుకుపోయి పూర్తి అశుభ్రంగా ఉన్న ఆ ప్రాంతంలో స్థానికులు పడుతున్న ఇబ్బందులను సాక్షి వెలుగులోకి తెచ్చింది. నరసాపురంలో కానరాని స్వచ్ఛత శీర్షికన మంగళవారం కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించి, ఆ ప్రాంతంలో ముగ్గు చల్లారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – నరసాపురం

సాక్షి స్పందన

ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు శుభ్రం



జేసీబీ సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు 12వ వార్డు కనకదుర్గమ్మ గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను మంగళవారం శుభ్రం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతోపాటు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండడంతో మే 20వ తేదీన సాక్షి కథనాన్ని ప్రచురించింది. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మునిసిపల్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీ సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కల్పించేలా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీరు సీసాతో వ్యక్తిపై దాడి



ఆస్పత్రిలో తీవ్ర గాయాలతో బాధితుడు కృష్ణ

తణుకు అర్బన్: పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని బీరు సీసాతో దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి తణుకు మండలం దువ్వ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొడ్డు కృష్ణ, ముద్దాపురం గ్రామానికి చెందిన గండికోట జాన్ యేసు మధ్య పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి దువ్వ దానమ్మ తల్లి ఆర్చి సమీపంలో ఉన్న కృష్ణపై యేసు బీరు సీసాతో దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచాడు. తీవ్రగాయాల పాలైన కృష్ణను స్థానికులు సమాచారంతో 108 వాహనం ద్వారా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గతంలోనూ ఇలాగే కత్తితో దాడిచేసిన ఘటనలో యేసు జైలులో శిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై విడుదలై వచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతివృత్తులను ఆదరించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు



చేతి వృత్తిదారుల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తులకు రక్షణ కల్పించి చేతివృత్తిదారులను ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఏలూరు స్ఫూర్తి భవనంలో మంగళవారం చేతి వృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా సమావేశం జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం సాధారణ చేతి వృత్తి దారులను ఏ మాత్రం ఆదుకోలేకపోయిందని ఆయన పేర్కొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో ఇప్పటివరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించలేదన్నారు. ప్రభుత్వాలు ఆదుకోకపోవడంతో చేతి వృత్తిదారులు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల ఉత్పత్తుల నుంచి పోటీ తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారులకు సాంకేతిక యంత్ర పరికరాలు, సబ్సిడీ రుణ పరపతి, భూమి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్టేలు పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే చేనేత, తదితర వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన వంగడాల వైపు రైతులు మొగ్గు చూపాలి

ఉండి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వినయలక్ష్మి



రాయలంలో మాట్లాడుతున్న ఉండి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వినయలక్ష్మి

భీమవరం అర్బన్: వ్యవసాయంలో సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ నూతన వంగడాల వైపు రైతులు మొగ్గు చూపాలని ఉండి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ పి. వినయలక్ష్మి అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, వాటి దిగుబడులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినయలక్ష్మి మాట్లాడుతూ 2048 వికసిత భారత్‌లో వివిధ రంగాల రైతులందరూ భాగస్వాములు కావాలన్నారు. వ్యవసాయంలో నూతన వంగడమైన ఎమ్‌టీయూ 1224 వంగడం గురించి వివరించి దాని బీజం, దిగుబడి గురించి చెప్పారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు సమీపిస్తుందని రైతులు భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట, పశువులు, కోళ్ల ఎరువులు చేలల్లో వేసి దున్నాలన్నారు. అంతేకాకండా సాగులో విచక్షణా రహితంగా రసాయన మందులు, ఎరువులు వాడి భూసారాన్ని పాడుచేయవద్దన్నారు. భావి తరాల జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలు అందించాలంటే రైతులు నూతన వంగడాలవైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సీటీఆర్ఐ టుబాకో, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ వై. సుబ్బయ్య, శాస్త్రవేత్త పి. సహదేవరెడ్డి , ఏఈఓ దేవి స్వరూప, రైతు కోళ్ల సీతారామ్, రైతులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి గొర్రెల కాపరి మృతి



మృతదేహాన్ని వెలికితీస్తున్న స్థానికులు

చాట్రాయి: నీటి కుంటలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన చాట్రాయిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సర్నాల మారేశ్వరరావు (40) మంగళవారం తన గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. సమీపంలో ఉన్న మందపాటి బసవారెడ్డి తోటలోని నీటి కుంటలో మేక పిల్ల పడిపోవడంతో మారేశ్వరరావు దానిని రక్షించబోయి మునిగి మృతిచెందాడు. అతడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

జిల్లా స్థాయి కార్యశాల శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్వేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల జిల్లా స్థాయి కార్యశాల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. జిల్లా కో ఆర్డినేటర్‌గా డీఈఓ వెంకటలక్ష్మమ్మ వ్యవహరించారు. అకడమిక్ కాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్, స్టూడెంట్ అసెస్మెంట్ బుక్, కరిక్యులమ్ ఇంటిగ్రేషన్ అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అసిస్టెంట్ జిల్లా కోఆర్డినేటర్ అంగులూరి సర్వేశ్వరరావు మంగళవారం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌సీఈఆర్‌టీ రాజబాబు హాజరయ్యారు. శిక్షణకు 162 మంది డీఆర్‌పీలు, 12 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. వీరు క్షేత్ర స్థాయిలో ఉన్న 3,250 స్కూల్ అసిస్టెంట్స్, ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 8, 9, 10 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు సర్వేశ్వరరావు తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు సంసిద్ధతా కార్యక్రమాలు, 9వ తరగతి విద్యార్థులకు జనవరిలో పరీక్షలు పూర్తిచేసి 10వ తరగతికి 40 రోజులు బ్రిడ్జి కోర్సు ముఖ్యాంశాలని రాజబాబు తెలిపారు. 1, 2 తరగతులకు, 9, 10 తరగతులకు ప్రత్యేక పాఠ్యపుస్తకాలుగా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయ రామరాజు, డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి నేతృత్వంలో రూపొందాయని వివరించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్ పాల్గొన్నారు.

ఏపీ ప్రజానీకానికి కూటమి వెన్నుపోటు

- కూటమి ఏడాది పాలనలో అమలుకాని పథకాలు
- మోసం, వంచన చేశారంటున్న ప్రజానీకం
- తణుకులో హైటెక్ టవర్..పారిశ్రామిక అభివృద్ధి వాగ్దానాల అమలెక్కడ...
- నేడు వెన్నుపోటు దినం..



తణుకులో వెన్నుపోటు దినం నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: సంపద సృష్టించి అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత కూటమి నేతలు వాగ్దానాలు గుమ్మరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని ఢంకాలు వాయించారు. నీకు రూ. 15వేలు, నీకు రూ. 18 వేలు అంటూ మహిళలను నమ్మించారు. ఉచిత బస్సు పథకంతో పాటు ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం అని ఏవేవో చెప్పేశారు. తీరా పింఛను రూ. వెయ్యి పెంపు తప్ప మరే పథకం అమలుచేయలేదంటూ ప్రజానీకం కూటమి ప్రభుత్వాన్ని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సూపర్ సిక్స్ ఇతర హామీలు అమలు చేయాల్సి ఉండగా ఇప్పటికే ఏడాది ఎగ్గొట్టేశారని ప్రజలు సైతం దుమ్మెత్తిపోస్తున్నారు.

వెన్నుపోటు దినంగా..

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేయడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 4న వెన్నుపోటు దినంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. దీంతో బుధవారం తణుకు నియోజకవర్గంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాచరణ చేశారు.

అమలు కాని ఎన్నికల హామీలు..

ఎన్నికల ప్రచారంలో భాగంగా తణుకులోని నరేంద్ర సెంటర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తణుకులో హైటెక్ టవర్ నిర్మిస్తామని, ఇంటి నుంచే ఉద్యోగాలు చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలులేక ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోతున్నారని తణుకును పారిశ్రామికంగా అభివృద్ధిపరిచి వలసలు అరికడతామని వాగ్దానం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయినా ఆ దిశగా ఇంకా అడుగులు ఏమీ పడకపోవడం దురదృష్టకరంగా ప్రజలు భావిస్తున్నారు.

ప్రజల్ని నమ్మించి మోసం చేశారు



వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అదే విధంగా ఎన్నికల ప్రచారంలో ప్రజల్ని నమ్మించి మోసం చేసి వారిని ఉసురు పెడుతున్నారు. సూపర్ సిక్స్ తోపాటు పలు పథకాలు ప్రభుత్వం ఏర్పడగానే అందిస్తానంటూ ప్రజల్ని వంచన, మోసం మాటలతో మాయచేసి అధికారం చేజిక్కించుకున్నారు. ఏ పథకం ఇవ్వకుండానే ఒక ఏడాది గడిపేశారు. ఇ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ఎమ్మెల్యేలంతా రోడ్లపైకి వెళ్తే ప్రజలు కొడతారేమోనని భయపడే పరిస్థితిలో ఉన్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

ఏడాది గడిపేశారు



కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు అందిస్తానని ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తానన్న కూటమి నేతలు ఏడాది పూర్తయి పోయినా ఇంతవరకు ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. పింఛను మాత్రమే వెయ్యి పెంచి ఇస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు పారదర్శకంగా సంక్షేమాన్ని అందచేసి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు.

– వద్లూరి సీతారాం, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి, తణుకు

ప్రజలకు వెన్నుపోటు పొడిచారు



కూటమి నేతలు తమ ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి ఆఖరుకు అమలుచేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఇంతవరకు ఒక్క పథకం కూడా అమలుచేయకపోకపోగా ఉపాధిని సైతం ఊడగొడుతున్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని, డీఎస్సీ తీస్తామని హామీలిచ్చి వాటి ఊసే లేకుండా ఇప్పటివరకు వలంటీర్లు, మద్యం దుకాణాల్లో గుమస్తాలు, ఎండీయూ వాహన ఆపరేటర్లు ఇలా ఎంతోమందిని ఉపాధి లేకుండా తొలగించారు.

– జల్లూరి జగదీష్, వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు, తణుకు

క్లుప్తంగా

నేడు వెన్నుపోటు దినం నిరసన

తణుకు అర్బన్: వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్‌తో పాటు ఏ ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ఏపీ ప్రజలను వంచన, మోసానికి గురిచేసినందుకు మాజీ ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతం నుంచి ర్యాలీగా బయలుదేరి నరేంద్రసెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



వేసవి శిక్షణ శిబిరంలో అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ జి.బాపయ్యశర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ఆసక్తికరంగా సాగింది. రిసోర్స్ పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే నీతికథలు, వి.జనార్దనరావుచే ఆత్మ విశ్వాసం ఎలా పెంపొందించుకోవాలి, జి.బాపయ్యశర్మలచే భారత రాజ్యాంగంలోని వివిధ అంశాలు, కోర్టులు, తదితర అంశాలను వెల్లడించారు. పుష్పలతచే యోగా, వ్యాయమాలు నేర్పించారు. ఈ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రాజధానులపై అవగాహన



విద్యార్థులకు దేశ రాజధానులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వివిధ దేశాల రాజధానులు, కరెన్సీపై అవగాహన కల్పించారు. రిసోర్సుపర్సన్ కె కోమలి విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. స్వామి వివేకానంద, మధరె థెరీస్సా జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఎం సత్యనారాయణ, కె ఫణీంద్ర, ఎల్ సునీతా, ఎ మానస తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

పాలకోడేరు: మండలంలో పశువులు కలిగిన రైతులకు 50 శాతం సబ్సిడీతో దాణా పంపిణీ చేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ టి. హేమ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలకోడేరు, గోరగనమూడి గ్రామాలకు చెందిన పాడి రైతులకు 50% సబ్సిడీతో కూడిన పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 కేజీల సామర్థ్యం కలిగిన పశువుల దాణా ఖరీదు 1110 రూపాయలు కాగా ప్రభుత్వం 50% సబ్సిడీతో రైతుకు 555 రూపాయలకే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోరగనమూడి సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు, గొట్టుముక్కల వెంకటరామరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి సైకిల్ అందజేశారు. మంగళవారం స్థానిక చినగోపురం బంగారు వారి శ్రీ వాసవి కళ్యాణ మండపంలో క్షీరపురి యోగా సత్సంగం ఆధ్వర్యంలో బీఆర్ఎంవీ మునిసిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని మాదిరెడ్డి ప్రణీతదేవికి సైకిల్ అందజేశారు. క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ సైకిల్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా సత్సంగ్ సభ్యులు క్లబ్ సభ్యులు సుధాకరరావు, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావులను సత్కరించారు.

'ఆరవ భూతం' కవితా సంపుటి ఆవిష్కరణ

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణే ప్రధానాంశంగా కవయిత్రి రచించిన ఆరవ భూతం పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశమని గజల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని యనమదల శ్రీదేవి రచించిన ఆరవ భూతం కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్లాస్టిక్‌ను నిర్మూలించాలనే సంకల్పంతో ఈ పుస్తకం రచించారన్నారు. గురు సహస్రవదాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ రచయిత్రి గొప్ప సందేశంతో పుస్తకాన్ని రచించారన్నారు. అనంతరం డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

గోగులమ్మ అమ్మవారికి పవళింపు సేవ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయం వద్ద విశేష పూజలు జరిగాయి. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి పాన్పు, పవళింపు సేవ జరిగింది. కర్పూర హారతి, పూరిగడిసె వద్ద ఆవు–దూడ గోపూజలు జరిగాయి. ఆలయ సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. మహిళలు, యువత, పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పడాల రోడ్డులో 33కేవీ నారాయణపురం ఫీడర్‌కు సంబంధించి కండక్టర్, విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామం, పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. పడాల, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలి



కొమ్ముగూడెం గ్రామంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కేవీకే విస్తరణ అధికారి డాక్టర్ వి.దీప్తి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ముందస్తు ఖరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా కోకో వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. అలాగే, వరిలో రకాలు, విత్తనశుద్ధి ప్రయోజనాలు, వేసవిలో లోతు దుక్కులు, పంట సాగు సమయంలో జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు తదితర అంశాలను రైతులకు తెలియజేశారు. ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు, పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి, గ్రామ సహాయ అధికారి ధర్మరాజు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. అలాగే, కృష్ణాయపాలెం గ్రామంలోనూ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం (విజయరాయి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ.రమణరావు, శాస్త్రవేత్తలు మేరీ రాణి, డాక్టర్ రేఖ, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు ఎంవీఎస్. ఆంజనేయులు, వీఆర్వో కే.రాంబాబు, వెటర్నరీ అసిస్టెంట్ పి.సువర్ణరాజు, అభ్యుదయ రైతులు సీహెచ్. వెంకటసుబ్బారావు, రెడ్డి శివయ్య, అమ్మిరాజు, రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక భాగ్యలక్ష్మిపేట, సీతారాం పేట సచివాలయాలు వద్ద ధర్నా కార్యక్రమాలు జరిగాయి. వినతి పత్రాలు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ పెంచిన ఆస్తిపన్ను భారాలు, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలన్నారు. సంవత్సరం కాలం అవుతున్న సూపర్ సిక్స్ అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రజలపై వేసిన భారాలను తగ్గించాలని, లేని పక్షంలో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రేషన్ డిపోలు ప్రారంభించడం సిగ్గుచేటు అని, తెలంగాణాలో మాదిరిగా సన్నబియ్యం ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని, మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇవ్వాలని, ప్రతి మహిళకు రూ 1500, ఉచిత బస్సు తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, చిట్టేటి సత్యనారాయణ, అయినాల సత్యనారాయణ, నరమాల కృష్ణ, రావి శ్రీనివాసరావు, ఎం.గణపతి, పతివాడ నాగేంద్రబాబు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు వేతనాలు చెల్లించాలి



గోటేరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఇరగవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులకు వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇరగవరం మండలంలోని గోటేరు, యర్రాయిచెరువు, గ్రామాల్లో పని చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ వేతనాలు అందక శ్రామికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే వేతనాల నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడలి దుర్గ, దొంగ రాజేశ్వరి, కవురు లక్ష్మీ కండిబోయిన లోకేష్, చిట్టూరి స్వామి, కుడుపూడి వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకట రావు, జుత్తిగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



జగన్నాథపురం గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం గడుస్తున్నా రోడ్లపై గుంతలు పూడ్చటం, పెన్షన్ 3వేల నుంచి రూ.4వేలకు పెంచడం మినహా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదని విమర్శించారు. తక్షణమే ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అలాగే, అర్హులైన వారందరికీ ఇంటి స్థలం గాని, కొత్త ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పేదలకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు ఇవ్వాలని కోరారు. సీపీఎం నాయకులు పీలా గాదినాయుడు, కండెల్లి రమేష్ బాబు, పీలా కోటేశ్వరరావు, గజ్జరపు వెంకటేశ్వరరావు, కోనవరపు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు దమ్ములో వేయాలి



వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్

అత్తిలి: వరిసాగులో అవసరానికి మించి ఎరువులు వాడరాదని, భాస్వరం ఇచ్చే కాంప్లెక్స్ ఎరువులు దమ్ములోనే వేయాలని మార్టేరు వరిపరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఆనంద్‌కుమార్ సూచించారు. మంగళవారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త ఆనందకుమార్ మాట్లాడుతూ నారును నాటే సమయంలో సుతలు త్రుంచి నాటినట్లుయితే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఆయిల్‌ఫాం శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటలు, ఆయిల్‌ఫాం తోటలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉండి కృషివిజ్ఞాన శాస్త్రవేత్త డెబోరా, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, సర్పంచ్ తానుకొండ దయామణి, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, నీటిపంపిణీ కమిటీ ఛైర్మన్ నల్లూరి సురేష్, స్థానిక నాయకులు అల్లూరి రఘువర్మ, కటికిరెడ్డి ప్రసాద్, పూతినీడి శ్రీనివాస్, ఆళ్తి అజయ్‌కుమార్, వీఏఏలు సాహిత్యరాము, సత్యనారాయణ, సౌమ్యశ్రీ, భాను ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బడిబయట దివ్యాంగులను గుర్తించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి బయట దివ్యాంగులను గుర్తించాలని మంగళవారం స్థానిక 3వ వార్డులో ఎన్రోల్మెంట్ డ్రైవ్ అవగాహన కార్యక్రమం జరిగింది. సచివాలయం మహిళా పోలీస్ పి.విజయకుమారి, భవిత సెంటర్ నిర్వాహకులు బాల ఈశ్వరయ్యలు మాట్లాడుతూ వివిధ రకాల వైకల్యాలు సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగుల పిల్లలను భవిత దివ్యాంగుల కేంద్రంలో చేర్పించాలన్నారు. కేంద్రంలో ఉచిత శిక్షణలు ఉంటాయని, ఫిజియోథెరపి అందజేస్తారని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పిల్లలకు శిక్షణ ఇస్తారని, అవసరమైన ఉపకరణాలు, బోధన సామగ్రి, సదుపాయాలు ఉన్నాయని దివ్యాంగులు ఉపయోగించుకోవాలని కోరారు. దివ్యాంగులు పిల్లలను నార్మల్ పిల్లలతో సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్రకుమారి, అండన్‌వాడీ సిబ్బంది దుర్గా భవాని, విష్ణువేణి తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు




మాధవరం శ్రీకంచి కామాక్షమ్మ వారి ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో పునఃనిర్మించిన శ్రీకంచి కామాక్షి సహిత శ్రీకామేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దీక్షా దంపతులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యంత్రార్చన, సాయంత్రం యాగశాల ప్రవేశం, వాస్తు హోమం వంటి క్రతువులు నిర్వహించారు. ఈ నెల 5న విగ్రహ ప్రతిష్ఠ, 7వ తేదిన కామేశ్వరస్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి వారు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

యలమంచిలి: యుక్త వయస్సులోనే మహిళలంతా నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. చించినాడ సచివాలయం వద్ద మంగళవారం జరిగిన కిషోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి యువతి జీవిత లక్ష్యాన్ని పెట్టుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ క్రమంలోనే నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలని చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి



తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల వరకే రాజకీయాలని, తదుపరి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పొనుకుమాటి శేషులత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీల పేరుతో గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అధికారులు ఎవరైనా సొమ్ములు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాలువ గట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో కంపోస్టు వేయాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. ప్రభుత్వ భూమి గ్రామాల్లో అందుబాటులో లేకపోతే భూమిని సేకరించి, కంపోస్టు వేయాలన్నారు. కాలువ గట్లను అపరిశుభ్రం చేస్తే ఫైన్ తప్పదని హెచ్చరించారు. తొలుత శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్, ఎంపీడీవో విశ్వనాథ్, ఏడీఏ మురళీకృష్ణ, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ డీఈ కేవీ.వెంకట్రావు, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఎంఈవో వి.హనుమ, ఉద్యాన శాఖ అధికారి శ్రీలక్ష్మి, విద్యుత్ ఏఈ రామకృష్ణ, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎమ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు



ప్రత్తిపాడు నూతనంగా నిర్మిస్తున్న శివాలయ పనులు ఆపాలని అధికారులు చెప్పడంతో నిరసన తెలుపుతున్న స్థానికులు

పెంటపాడు: గ్రామంలో లక్షల రూపాయల భక్తుల విరాళాలతో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోవడం తగదని, దానికి తక్షణం కొనసాగించాలని ప్రత్తిపాడు శివాలయ నిర్మాణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రతిమాంబ సమేత సదాశివ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిర్మాణాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించిన పంచాయతీ, రెవిన్యూ అధికారులకు అడ్డుతగిలారు. శంభో శంకర అంటూ గ్రామస్తులు నినాదాలు చేసారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకొంది. గత కొద్దినెలలుగా ఈ ఆలయం భక్తుల విరాళాతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంటున్న తరుణంలో ఇప్పుడు అధికారులు పనులు సాగనివ్వకుండా అడ్డుకోవడం సమంజసం కాదని ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయంపై తాము నిరసన తెలుపుతున్నట్లు కమిటీ అధ్యక్షుడు వీర్ల కృష్ణ పేర్కొన్నారు. అయితే గ్రామ వీఆర్వో భువన, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావులు మాట్లాడుతూ జెడ్పీ భూములలో ఆలయం నిర్మించడం తగదన్నారు. ఇటీవల నిర్మాణం చేయకూడదని ఫ్లెక్సీలు కట్టినా, వాటిని తొలగించి యధాతదంగా ఆలయ నిర్మాణం చేయడం తగదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము అడ్డుకొంటున్నామన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

నరసాపురం: కౌలు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని ఏపీ కౌలురైతుల సంఘం నరసాపురం కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతిపత్రం ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీకి చెందిన గంజి శ్రీనివాస్ రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఆయన మంగళవారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయం వద్ద శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. జన సైనికులు కర్రి సురేష్, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, టి.గురుమూర్తి, పైబోయిన వెంకట్రామయ్య, వెంకటేష్, శ్రీను, రవి పాల్గొన్నారు.